# కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

## సమస్యలపై ఆరా... విద్యార్థినులతో కలిసి భోజనం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా లేకపోతున్నదా అన్నదాన్ని పరిశీలించారు. తరగతుల్లోకి వెళ్లిన అదనపు కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యక్షంగా చర్చలు జరిపారు. పాఠాల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు తమ సందేహాలను ఉద్ఘాటించి పరిష్కరించుకోవాలని సూచించారు. హాస్టల్, మూత్రశాలల పరిశుభ్రతను పరిశీలించిన ఆమె, మురుగు నీటి సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాలికల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించాలని ఏఎన్ఎంలకు సూచించారు. వంట మనుషుల పనితీరులో లోపాలుంటే వెంటనే సరి చేయాలని చెప్పారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్, ఓపీ రిజిస్టర్, మందుల నిల్వ గదులు, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంపీఓ ప్రభాకర్, వైద్యాధికారి శ్రావణ్ కుమార్, ఏపీవో శారద, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, గోపగోని బసవయ్య పాల్గొన్నారు.







# వైద్య, విద్యా రంగాల బలోపేతమే లక్ష్యం

- జిల్లాలో పర్యటించిన కలెక్టర్ కుమార్ దీపక్
- హాస్పిటల్స్, పాఠశాలల్లో తనిఖీలు
- విద్యార్థులకు క్లాస్ తీసుకున్న కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజలకు నాణ్యమైన వైద్య, విద్యా సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం కాసిపేట మండలంలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలను సందర్శించిన ఆయన, ప్రతి స్థాయిలో సేవల నాణ్యతను పరిశీలించారు.

**ఆరోగ్య సేవలపై సమీక్ష**

కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి వార్డులు, మందుల నిల్వలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే విషజ్వరాలు, అంటువ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అందుబాటులో ఉన్న చికిత్సా వసతులపై సమీక్ష నిర్వహించి, వైద్యులతో చర్చించారు.



**విద్యార్థులకు క్లాస్ తీసుకున్న కలెక్టర్**

ముత్యంపల్లి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వారితో కలిసి పాఠాలు చెప్పారు. హాజరు పట్టికలు పరిశీలించి, వంటశాల అవసరం గుర్తించి మంజూరుచేసేందుకు హామీ ఇచ్చారు. కస్తూర్బా బాలికల విద్యాలయంలో భోజనశాల నిర్మాణం, మౌలిక సదుపాయాలపై అధికారులను ప్రశ్నించారు. తాగునీటి కోసం ఆర్.ఓ. ప్లాంట్ పనిచేయాల్సిందిగా ఆదేశించారు.

**ఆశ్రమ పాఠశాలల్లో పరిశీలన**

దేవాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో పౌష్టికాహారం సమయానికి అందించాలని సూచించగా, మల్కపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యా ప్రమాణాలపై చర్చించారు. రేకులగూడ ఆశ్రమ పాఠశాలలో మురుగునీటి వ్యవస్థ, ఇంకుడు గుంతలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలోని బావిని పరిశీలించిన కలెక్టర్, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని స్పష్టంచేశారు.

ఈ పర్యటనలో మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం నాయక్, ఆశ్రమ పాఠశాల అధికారి నీరటి రాజేశ్వరి, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపాలన పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- అన్ని శాఖలతో సమన్వయానికి కలెక్టర్ దిశానిర్దేశం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జిల్లాలో గ్రామపాలన పరీక్షను పూర్తి స్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 27న జెడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించనున్న పరీక్ష ఏర్పాట్లపై నస్పూర్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పీ. చంద్రయ్య, బెల్లంపల్లి, మంచిర్యాల తహసీల్దార్లు, విద్య, వైద్యం, విద్యుత్, మున్సిపల్, పోలీస్, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

**విభాగాల బాధ్యతలు స్పష్టంగా**

కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామపాలన, లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు త్రాగునీరు, వెలుతురు, పారిశుద్ధ్యంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల భద్రత, స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లను పోలీసు శాఖ పర్యవేక్షించనుంది. విద్యుత్ శాఖ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించాల్సిందిగా సూచించారు. వైద్య శాఖ వైద్య శిబిరం ఏర్పాటు చేసి హెల్త్ కిట్లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు.



**కఠిన నిబంధనలు, భద్రతా ఏర్పాట్లు**

పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల హాల్ టిక్కెట్లు, గుర్తింపు కార్డులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిందిగా సూచించారు. మొబైల్ ఫోన్, టాబ్లెట్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, నోట్స్, గడియారాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. క్లాక్‌రూమ్ సదుపాయం ఉండదని, అభ్యర్థులు కేవలం బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, హాల్ టిక్కెట్, గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలని తెలిపారు. పరీక్ష రోజు ఉదయం 9 నుంచి ప్రవేశం ఇవ్వనున్నామని, 10 గంటల తర్వాత ఎవ్వరినీ అనుమతించబోమని స్పష్టంచేశారు. కేంద్ర పరిసరాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ అమలు చేస్తామని, ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండరాదని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాదిగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# వాస్తవాలే ఆయుధంగా పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ప్రజాస్వామ్యంలో పాత్రికేయులకు ప్రత్యేక స్థానం ఉందని, వారు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను నిబద్ధతతో వాడుతూ ప్రజల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... పత్రికలదే ప్రజలు, ప్రభుత్వ మధ్య వారధిగా మారే బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజల అవసరాలు, సమస్యలు, అన్యాయాలను వెలుగులోకి తెచ్చే విషయంలో పాత్రికేయుల పాత్ర కీలకమని కలెక్టర్ అన్నారు. మీడియా ద్వారా ప్రపంచానికి తెలియని ఎన్నో వాస్తవాలు బయటపడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు.

**నకిలీ పాత్రికేయులకు హెచ్చరిక**

కొంతమంది వాస్తవాలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలపై అసత్య కథనాలు రాసి డబ్బులు వసూ లు చేస్తున్న నకిలీ పాత్రికేయుల పట్ల తీవ్రంగా వ్యవహరిస్తామని దీపక్ హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**నిజనిర్ధారణ తప్పనిసరి**

ప్రతి కథనం ప్రచురించే ముందు పూర్తి స్థాయిలో నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించిన కలెక్టర్... నకిలీ పాత్రికేయుల వల్ల అసలైన జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను వెలిగించే ధర్మమే పాత్రికేయుడి అసలైన బాధ్యత అని స్పష్టం చేశారు.

# ఘనంగా కేటీఆర్ బర్త్ డే సెలబ్రేషన్స్



**శెనార్తి మీడియా, రామడుగు :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బర్త్ డేను రామడుగు మండలం వెలిచాల ప్రశాంత్ భవన్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రశాంత్ భవన్ పిల్లలకు నిత్యావసర సరుకులు, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి, మాజి ఎంపీపీలు మార్కొండ కిష్టారెడ్డి, తౌటు మురళి, ఏఎంసీ మాజీ చైర్మన్లు మామిడి తిరుపతి, గంట్ల వెంకట్ రెడ్డి, పూడూరు మల్లేశం, మాజీ మండల అధ్యక్షుడు జూపాక కరుణాకర్, నాయకులు వీర్ల సంజీవరావు, నాగి శేఖర్, చాడచంద్రశేఖర్ రెడ్డి, పంజాల జగన్మోహన్ గౌడ్, వీర్ల రవీందర్ రావు, సైండ్ల కరుణాకర్, గుండి ప్రవీణ్, జవ్వాజి శేఖర్, ఊగంటి చంద్రారెడ్డి, చిలుముల ప్రభాకర్, జూపాక మునీందర్, ఎల్లా జగన్మోహన్ రెడ్డి, శనిగారపు అనిల్, బత్తిని తిరుపతిగౌడ్, పెగడ శ్రీనివాస్, గునుకొండ తిరుపతి, దొడ్డ లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కేశవపట్నంలో..**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు శంకరపట్నం మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యం లో జరిగాయి. కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన ఆయురారోగ్యాలతో నిలకడగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, మెట్టుపల్లి సొసైటీ చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, గద్దపాక సొసైటీ చైర్మన్ గుర్రం తిరుపతిరెడ్డి, సతీష్ రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పల్లె సంజీవరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, కాటం వెంకటరమణారెడ్డి, మోరే శ్రీనివాస్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోస్ట్‌మెట్రిక్ స్కాలర్షిప్‌కు సెప్టెంబర్ 30లోగా నమోదు

- విద్యార్థులు, కళాశాలలు ఈ-పాస్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

2025–26 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్‌మెట్రిక్ స్కాలర్షిప్ కోసం విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా తమ వివరాలను ఈ–పాస్ పోర్టల్‌లో నమోదు చేసు కోవా లని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. నూతన దరఖాస్తుదారులు, పునర్వీక్షణ కోరుకునే విద్యార్థులు www.telangana epass. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాల్సిందిగా సూచించారు. సీఈటీఎస్ ద్వారా కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందిన విద్యార్థులు తప్పనిసరిగా తమ సమాచారం అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అలా చేసినపుడే పోస్ట్‌మెట్రిక్ స్కాలర్షిప్ మంజూరు అవుతుం దని వివరించారు. కళాశాలలు తమ రిజిస్ట్రేషన్ స్థితిని, విద్యార్థుల నమోదు పురోగతిని పబ్లిక్ పోర్టల్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు, కళాశాలలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకోండి

- అంబేద్కర్ ఓవర్సీస్ ఫండ్ కోసం ఆగస్టు 31 చివరి తేదీ
- అర్హులైన ఎస్సీ విద్యార్థులకు రూ.20 లక్షల వరకు ఉపకారవేతనం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి అర్హులైన షెడ్యూల్డ్ కుల విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకో వాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు సిహెచ్. దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ పథకం 2025–26 విద్యా సంవత్సరానికి వర్తించనుందని పేర్కొన్నారు.

**రూ.20 లక్షల వరకూ ఉపకారవేతనం**

ఈ పథకం కింద విద్యార్థులకు గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు నిధులు లభిస్తాయని తెలిపారు. యుఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్‌లలోని విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లేదా ప్రొఫెషనల్ కోర్సులకు ప్రవేశం పొందినవారు ఈ పథకానికి అర్హులని వివరించారు.

**అర్హతలు ఇవీ..**

దరఖాస్తు చేసేవారు షెడ్యూల్డ్ కులానికి చెందాలి. వార్షిక కుటుంబ ఆదాయం రూ.5 లక్షల లోపుగా ఉండాలి. డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. టోఫెల్, ఐఇఎల్‌టీఎస్, జీఆర్ఈ లేదా జీఎంఏటీ అర్హత స్కోర్లు తప్పనిసరిగా ఉండాలి. పాస్‌పోర్ట్, వీసా, విదేశీ యూనివర్సిటీ అడ్మిషన్ లేఖ కలిగి ఉండాలి. ఒక్క కుటుంబం నుంచి ఒక్కరే దరఖాస్తు చేసుకునే అర్హత కలిగి ఉంటారని స్పష్టంచేశారు.

**దరఖాస్తు కోసం వెబ్‌సైట్‌లో నమోదు**

విద్యార్థులు ttps://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.




# గ్రామాల అభివృద్ధికి కేంద్రమే ఆధారం

- ఇందిరమ్మ బిల్లులు కూడా ప్రధాని యోజన కిందే: బీజేపీ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో బీజేపీ ఎన్నికల కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ప్రభారి గుజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర నిధులతోనే కొనసాగుతున్నాయన్నారు. వైకుంఠధామాలు, సిసి రోడ్లు, పంచాయతీ కార్యాలయాల నిర్మాణం కేంద్ర మద్దతుతోనే జరుగుతుండగా, ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు కూడా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిని పట్టించుకోకుండా అధికార దర్పం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మాటకు స్థానిక నాయకులు విలువ ఇవ్వడం లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కి తగిన బుద్ధి చెప్పే అవకాశముందని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ పార్టీ శ్రేణులు స్థానిక ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ప్రతినిధి అలివేలి సమ్మిరెడ్డి, దండు కొమురయ్య, దొంగల రాములు, రాసమల్ల శ్రీనివాస్, వీరార్జున్, ఇతర మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంపేటలో వర్షానికి కూలిన మెట్లు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని కరీంపేట గ్రామంలో బొజ్జ మొగిలి ఇంటి మెట్లు కూలిపోయాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు మురికికాలువలో నిలిచిపోయి మెట్లకంటే పైకి చేరడంతో అవి కుంగి కూలిపోయినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామపంచా యతీ గత పాలకవర్గం ఇంటి పక్కగా మురికికాలువ కోసం జేసిబితో తవ్వకం చేపట్టి, సీసీ నిర్మాణాన్ని పూర్తిచేయకపోవడంతో కాలువ చివరి వరకు నీరు నిలిచిపోతున్నదని వారు వివరించారు. ఈ సమస్యపై గ్రామపంచాయతీ కార్యదర్శికి, సిబ్బందికి పలు మార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి మెట్ల మరమ్మతులు చేపట్టి, కాలువ సమస్యను పరిష్కరించాలని మొగిలి కోరారు.